




చైతన్య మాలిక

రాతలు తలల నుండే కదుల్తాయి. కొన్నిరాతలు తలలను కదుపుతాయి. కుదుపుతాయి. పొదుపుగా కొన్ని పద సుమాలతో ఉక్తులు అవుతాయి. స్ఫూర్తి పరిమళాలను తోడుచేసుకొని సూక్తులవుతాయి. మనసులో విరబూసిన విజ్ఞాన చేమంతులే సూక్తులు. అందమైన భావ జగత్తులో చేతనత్వముతో చలించే చేమంతులు. చైతన్య చేమంతులు. నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు'అని గుండెలను కరిగించలేని రాతి బండలను ఒక కవి విసిరివేస్తే,'గంగి గోవు పాలు గెరిటెడైనను చాలు' అని హృదయంలో అమృతబిందువులను చిందించే రస గుళికలను మరొక కవి ఏరి దాచుకున్నాడు. మనసులో రణం లేకుండా జీవించుటకు మరణం లేని మాటలను చేమంతి మాలగా తీర్చిదిద్దిన చైతన్య పొత్తము ఈ

'చైతన్యచేమంతులు' పుస్తకము. అప్పుడప్పుడు, అలా అలా నా మనసులో కులికినవి, వేదికలపై నేను పలికినవి ఈ పుస్తకంలో సూక్తులుగా ఉన్నాయి. ఇందులో ఉన్నవన్నీ పలుకులే అయినా, గొప్ప పలుకుబడిని కలిగి ఉన్నాయి. ఈ సూక్తులన్నీ అర్థం చేసుకొని ఆచరించేందుకే ఉన్నాయి. అన్నీ కాక పోయినా, కొన్ని అయినా బ్రతుకులో తొంగిచూస్తే,జీవితంలో క్షోభ తగ్గుతుంది. జీవిలో శోభ పెరుగుతుంది. ఇవన్నీ చేమంతులు. చైతన్య చేమంతులు. పూస గుచ్చి, మాలగా తీర్చి శ్యామసుందర భగవానుని అలంకరించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక మనం చేయదగిన, చేయవలసిన కార్యమే మిగిలిఉంది. చేసుకున్న వారికి చేసుకున్నంత. అస్తు.

స్వామి సుందర చైతన్యానంద

****చైతన్య చేమంతులు****

1. వస్తువు ఉన్నదే అయినా, వస్తుజ్ఞానము లేనపుడు ఉన్నది లేనట్లే ఉంటుంది ఈశ్వరుడు ఉన్నవాడే అయినా, ఈశ్వర జ్ఞానం లేనపుడు ఉన్నఈశ్వరుడులేని వాడు గానే ఉంటాడు.

2. జరగనివి జరగాలని జాగరణ చేసే వాని కన్నా, జరిగే వాటిని అర్థంచేసుకొనిఆనందంగా బ్రతికే వాడే లోకంలో మిన్న. లేనివి రాలేదని ఆవేదన పడే వాని కన్నా, ఉన్న వాటితో తృప్తి చెందే వాడే అధికుడు ఎప్పుడైనా.

3. పాలు వెన్న కాదు. కానీ పాలలో వెన్న ఉంది. వెన్న పాలలో ఉన్నట్లు పరమేశ్వరుడు ప్రపంచంలో ఉన్నాడు. చిలికితేనే వెన్న, చింతనము లోనే వెన్నుడు.

4. తినడానికి ఎన్నయినా ఉండొచ్చు. తినే వాడికి ఆకలి ఉండాలి. ఆసక్తి ఉండాలి. తెలుసుకోవ డానికి జ్ఞానంసిద్ధంగా ఉండొచ్చు. తెలుసుకొనేవాడికి ఆర్తి ఉండాలి. భక్తి ఉండాలి. భక్తినైవేద్యంగా మారితే ముక్తిప్రసాదంగా అందుతుంది.

5. అవసరం లేని వాటిని కోరనివాడు, భక్తి లేని వారిని చేరనివాడు, పెద్దల మాటలను మీరని వాడు సాధకుడు. సాధ్యరూపుడైన పరమేశ్వరుని సాధించుటలో సిద్ధహస్తుడు.

6. ప్రపంచమూ, మనమూ రెండూ సత్యమైతే, మనం వెతికేది ఏ సత్యంకోసం? ప్రపంచం కోసమైతే, మనల్ని మనం పోగొట్టుకుంటాం. మనకోసమైతే, ప్రపంచం మన నుండి జారిపోతుంది. ఇక్కడే ద్వైతమును జీర్ణించుకో లేము. అందుకే, ద్వైతము భక్ష్యము కాదు అన్నది ఉపనిషత్తు (అభక్ష్యం ద్వైత భావనమ్).

7. బండి చిన్నదైనా పెద్ద పెద్ద బరువుల్ని మోస్తుంది. చెట్టు పెద్దదైనా చిన్న చిన్న బరువులను కూడా మోయలేదు. పెద్దతనం ఉంటే ఉండొచ్చు. పరులను భరించే పెద్ద మనసు అందరికీ ఉండదు.

8. తప్పు చేసే వారు పరుల ముందు తల వంచుతారు. భక్తి చేసే వారు పరమేశ్వరుని ముందు తలవంచు తారు. పరుల ముందు తలవంచేవారు దుఃఖంతో కృంగి పోతారు. పరమేశ్వరుని ముందు తల వంచేవారు ఆనందంతో పొంగి పోతారు.

9. ఒకరు మనల్ని చులకనచేయడం వల్ల మనం చులకనపడము. అతడు నన్ను చులకనగాచూస్తున్నాడు అనే ఆలోచన వల్లే మనం బలహీనులమవుతాము.

10. మంచి పనులు చేసే వారందరు మంచి ఆలోచనల్ని కలిగి ఉంటారని చెప్పలేము. కాని, మంచి ఆలోచనలు కలవారు మాత్రం ఎప్పుడూ మంచి

పనులే చేస్తారు.
11. సమస్తాన్ని పోగొట్టుకొని దీనావస్థలో కొన సాగుతున్న దశలో కూడా శ్రీరామచంద్రుడు విభీషణునికి లంకను దానం చేశాడు. ఇవ్వ గలిగినా ఇవ్వలేనివాడు లోభి. ఇవ్వలేని స్థితిలోకూడా ఏదో ఇవ్వ గలిగిన వాడు త్యాగి.
12. తనకు ఆశ్రయము జలమే అయినా, ఆశకు దాసియై చేప వలలో పడుతుంది. లేదా గాలానికి చిక్కిప్రాణాలను పోగొట్టు కుంటుంది. సర్వాధారుడైన పరమేశ్వరుని విస్మరించి ప్రపంచం వైపు పరుగులు తీసే జీవులకు మాత్రం ఇంతకన్నా ఏం మిగుల్తుంది?
13. తమ కంటూ చూపు లేకపోయినా, తాము తొడుక్కో వలసిన చెప్పుల్ని కాళ్ళు గుర్తిస్తున్నాయి. కాని, తమకు చూపు చక్కగా ఉన్నా, నిత్యా నిత్యాల మధ్య తారతమ్యాన్ని కళ్ళు చూడలేక పోతున్నాయి. మనస్సు గుర్తించలేక పోతూ ఉంది.
14. దక్షుడికి యజ్ఞభూమి కూడా ఉపకరించ లేదు. అర్జునుడికి యుద్ధభూమి కూడా సహకరించింది. అహంకార దర్పాలు పాతాళంలో పడేస్తాయి. వినయ వివేకాలు గగనంలో విహరింప చేస్తాయి.
15. ప్రయత్నిస్తే నీ మనస్సును నీవు అర్థం చేసుకో గలవు. కాని, ఎంత ప్రయత్నించినా నీ మనస్సుకు నువ్వు అర్థం కావు. నిన్ను మనస్సు చూపెట్టినట్లు కాకుండా, నీవు నీవుగా నిన్ను చూసుకొనే ప్రయత్నమే శ్రేయస్కరము.
16. భక్తి అనేది ప్రేమ ప్రవాహం. ఉన్న చోటే ఉండదు. నిరంతరం చలిస్తూ ఉంటుంది. చలింప చేస్తూ ఉంటుంది. ఒక దశలో మనలను జ్ఞానకడలిలో కలసి పోయేలా, కరిగిపోయేలా చేసి తరింప చేస్తుంది.
17. నాకు ఇది ఉంది అనుకునే వాడికి నాకు మరేదో లేదు అనేది కూడాఉంది. నాకు ఏదీ లేదు అనుకునేవాడికి నాకు మరేదో లేదు అనేది

కూడా లేదు. కనుక, 'లేదు' అనేది లేనివాడు వాస్తవానికి ఉన్నవాడే. అన్నీ ఉన్నవాడే. అంతా ఉన్నవాడే.

18. అరటి పండును తినిన తరువాత తొక్కను ఏం చేస్తామో, సారరూపుడైన పరమేశ్వరుని గ్రహించిన తరువాత ప్రపంచాన్ని అదే చేయాలి. తొక్కపై మనకు ద్వేష ముంటుందా? అలాగని ఆసక్తి ఉంటుందా? ప్రపంచం విషయంలో కూడా అలాగే ఉండాలి.

19. ధన మున్నా మద మెరుగనివాడు, జన మున్నా గుణ మరగనివాడు మనీషి. ఏదో ఓనాడు అతడే అవుతాడు మహర్షి.

20. బుద్ధితో తెలుసుకొనేది ప్రపంచజ్ఞానము. బుద్ధిలో తెలిసేది పరమాత్మ జ్ఞానము. పరమాత్మది సర్వ జ్ఞానము, జ్ఞానమైనా పరమాత్మ జ్ఞానం లోనే ఇమిడి ఉంది.

21.రాత్రంతా ప్రపంచంలో చీకట్లు ముసురుకున్నా, మన కంటిలో చీకటి లేకపోతే తెల్లవారగానే వెలుగులు కళ్ళముందు ఆరబోసు కుంటాయి.

22. ఆలోచనల నుండి విడిపడటం అసంగత్వం కాదు. అది యోగం. ధ్యాన యోగం. ఆలోచనలు ఉన్నా సంగత్వం లేదని తెలియడమే అసంగత్వం. ఇది జ్ఞానం. ఆత్మజ్ఞానం.

23. నిశ్శబ్దాన్ని పాటించడం కర్మ. నిశ్శబ్దమై ఉండటం జ్ఞానం. అదే మౌనవ్యాఖ్యానం. పరమాత్మను ప్రకటించే మౌన వాక్యం.

24. ఉన్నది ఏదైనా, అది నీవైనా కావాలి. లేదా, నీ అనుభవంగా నైనా ఉండాలి. మొదట నీవు ఉంటే, ఆతరువాత అనుభవాలు కలుగుతాయి. అనుభవాలు లేకపోయినా నీవు ఉంటావు. అనుభవంఉంటే నష్టంలేదు. అనుభవమే జ్ఞానము అనుకుంటే లాభంలేదు.

25. ఏదో చెయ్యాలి అనే ఆలోచనకన్నా, ఎలా ఉండాలి? అనే ప్రశ్నపడితే, లేదా ఆలోచనపుడితే, ఆ క్షణంనుండే జీవితం ఒక అందమైన మలుపుతిరుగుతుంది.

26.మనం కష్ట పడటానికి మరొకరు ఉండాలి అనే నియమ మేమీ లేదు. కష్ట పడే మనసు ఉండాలే గాని, ఎవరూలేక పోయినా, అది కష్ట పడుతూనే ఉంటుంది. ఏదో ఊహించుకొని వ్యథచెందుతూనే ఉంటుంది. పరులను కష్ట పెట్టే మనస్సు ఎవ్వరూలేకపోతే తననే తాను కష్టపెట్టుకుంటుంది. మనం కష్ట పడకుండా మరొకరిని కష్టపెట్ట లేము.

27. మంచి ఆలోచనలు చేయలేకపోవడం శాపం కాదు కానీ, చెడు ఆలోచనలు చేయడం మాత్రంపాపమే. చూస్తేనే కనిపించేవి చూడకపోతే అగుపించవు.

28. జన్మించడం మన చేతిలో లేదు. జీవించడం మన చేతి లోనే ఉంది. పరిస్థితుల్ని మనం శాసించ లేము.ప్రవర్తనను మనం నియంత్రించుకోగలం.

29. వెన్న ఉన్న చోటే నెయ్యి ఉంది. గురువు ఉన్న చోటే గోవిందుడున్నాడు. గురుదేవుని సన్నిధిలో ప్రాప్తించే అక్షయ నిధియే దేవ దేవుడు.

30. వచ్చే జ్ఞాపకాలను ఆపడం మనిషికి ఎలా సాధ్యం కాదో, వచ్చిన జ్ఞావకా లతో కలిసి హాయిగా జీవించడం కూడా అలాగే సాధ్యంకాదు. విచారము లేకుండా విషాదమురాదు. ఆలోచనల నుండే ఆవేదనలు పుట్టు కొస్తాయి.

31. భగవంతుడు భవిష్యత్తులో ఎప్పుడో, ఎక్కడో కనిపించే వాడుకాడు. ఇప్పుడు, ఈ క్షణంలో కూడా భగవంతుడు మనతో కలిసే ఉన్నాడు.భగవంతుడు ప్రత్యేకంగా వచ్చేవాడుకాడు. పనిగట్టుకొని పోయే వాడూకాడు. సదాశ్వాసలాగా కలిసిఉండేవాడు. ఇదేజ్ఞానం. ఈశ్వరజ్ఞానం.

32. భగవంతుణ్ణి అర్థం చేసుకొనే శక్తిమనకు లేదు. కాని మన బాధలను, బాధల్ని పోగొట్ట మని మనం వినిపించేమొరను భగవంతుడు అర్థం చేసుకుంటాడు. భక్తు డైన వానికి ఇదేశ్రీరామ రక్ష.
33. ఇచ్చేందుకు వస్తువుల్ని, ఇచ్చేచేతుల్ని, ఇవ్వాలనే చిత్తాన్ని అన్నిటినీ పరమాత్మే మనకు అనుగ్రహించాడు.అవన్నీప్రసాదాలే. వాటిని అలాగే వినియోగించు కోవాలి. అదేసమర్పణము.
34. అవసరాలు ఉండొచ్చు. ఉంటాయి కూడా. అలాగని, ఆశలు ఉండ నవసరం లేదు. అవసరాలకు అవధు లుంటాయి. ఆశలకు హద్దులుండవు. ఆశ పెరిగేదే గాని తరిగేది ఉండదు. తోడు పెట్టినా, తోడు పడినాపెరుగుతూనే ఉంటుంది. పెరుగులాగడ్డ కడుతూనే ఉంటుంది. శాంతితరుగు తూనే ఉంటుంది.
35. నాహం కర్తా హరిః కర్తా - నేను ఏదీచేయడం లేదు. అంతా శ్రీహరే చేస్తున్నాడు. ఈ భావన బుద్ధిలో కదలగానే నీవు చేసే వాడివి కాకుండా, చేసే వాడిని చూచే వాడివి అవుతావు.
36. జీవితంలో ఏది నీది? ఎవరు నీవారు? నీ కున్నది నీది అవుతుందేగాని, నీది కావాలి అనుకున్నది నీదికాదు. ఆశించి పొంద లేనిది నీదికానపుడు, పొంది పోగొట్టు కొనేది మాత్రం నీది ఎలా అవుతుంది?
37. మనుషులు జలాన్ని పానంచేస్తారు. దేవతలు అమృతాన్ని పానంచేస్తారు. మహాత్ములు జ్ఞానామృతాన్నిపానం చేస్తారు (అర్థ రసం పిబన్తః). అందుచేత మహాత్ములు జీవన్ముక్తులై శోభిస్తారు.
38. వివేకము అనేది అనుభవాలను పొందటం వల్ల కలిగేది కాదు; అనుభవాలను అర్థం చేసుకోవడంవల్ల మిగిలేది; దివ్యంగా వెలిగేది.
39. వైరాగ్య మంటే ఉన్న వాటినిత్యజించడము కాదు. అవసరం కానివి మనస్సులో చేరకుండా జాగ్రత్తవహించడమే వైరాగ్యము.

40. ఏ ధనమైనా వ్యయమే. క్షయమే. జ్ఞానమొక్కటే అక్షయ ధనం.
ఈసత్యము నెరిగిన వారే ధన్యులు. ఎరుగని వారు అన్యులు.
41. జగతికి చీకట్లు తెలియనివికావు. జీవికి ఇక్కట్లు క్రొత్తవి కావు.
ఈ ప్రపంచంలో ఎవడైనా బాటసారే. ఈ జగతి ఎవరి కైనా ఎండమావే.
42. బుద్ధి పారిపోతేపోనీ. భగవంతుడు జారి పోకుండాచూసుకో. చాలు.
43. ఏవో లేవని దుఃఖిస్తూఉంటాము. అవి మనకు అవసరాలుకావని,
అందుకే మన వద్ద లేవనే సత్యాన్ని అర్థం చేసుకోము.
44. పరమాత్మ మనల్ని సేవకులుగా సృష్టించ లేదు. మనమే
ఆ మహితాత్ముని ప్రభువుగా ఎన్నుకున్నాం.
45. నేత్రాలు మూసి పడుకున్ననిన్ను నిద్ర తన ఒడి లోకి తీసుకున్నట్లు,
అంతర్ముఖు డవై ధ్యానంలో నిలిచిన నిన్ను పరమాత్మ
తనలోకితీసు కుంటాడు. దైవాన్ని చేరా లంటే ధ్యానంచేసితీరాలి.
46. ప్రపంచం ఉండొచ్చు. కాని, దానిని గ్రహించే నీ కన్నా వేరుగాప్రపంచం
ఉండ లేదు. అది - ఇది; అక్కడ - ఇక్కడ; అప్పుడు - ఇప్పుడు
అనేవి తెలుస్తూ ఉండినా, అవేవీ చైతన్యమును దాటి పోలేవు.
47. ప్రవాసంలో విద్య మిత్రుడు. గృహంలో భార్య మిత్రురాలు.
రోగంవచ్చినపుడు ఔషధము మిత్రుడు. మరణానంతరం ధర్మమే మిత్రుడు.
మిత్రు డెవరో కాదు. మేలు చేసే వాడు మిత్రుడు. మేలుకొలిపేవాడు
మిత్రుడు.
48. జీలకర్ర చేదు. బెల్ల మేమో తీపి. వాటిని ఇరువురూ
కలిసిఅనుభవించాలని ఒకరి తలపై మరొకరు పెట్టుకుంటారు. ఆ
తరువాత, ఎవరి తలలువాళ్ళు పట్టుకుంటారు. అదే సంసారమంటే.
49. బాలకృష్ణుని ఎన్ని కష్టాలుచుట్టు ముట్టాయో మనకుతెలియదా?
అన్నిటినీ నవ్వుతూ ఆలింగనం చేసు కున్నాడు. ఎవరినీద్వేషించ లేదు.

దేనికీ భయపడ లేదు. మందహాసాన్ని చిందిస్తూ అందరికీ ఆనందాన్ని పంచాడు. మనం కృష్ణ భక్తులం. మనమూ అలాగే జీవిద్దాం.

50. పరమాత్మ పాదారవిందమే సర్వులకు ఆధారము. కాని, భక్తులైన భ్రమరాలకు ఆ చరణార విందము ఆధార స్థానమే కాదు; ఆనందనిలయము కూడా.

51. భక్తితో వేడుకొనే వాడు భక్తుడు. శక్తితో కాపాడేవాడు భగవంతుడు. రెండు చేతులతో ఆరాధించేవాడు భక్తుడైతే, నాలుగుచేతులతో ఆశీర్వదించేవాడు భగవంతుడు. అందుకేఆయన చతుర్భుజుడు.

52. పరులలో దోషాలున్నాయని, ద్వేషాలున్నాయని కలతపడటం దేనికి? అవి మనలో లేనందుకు పరమేశ్వరునికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

53. నిమిషం నిలబడని యవ్వనం, క్షణంకూర్చోలేని వృద్ధాప్యం సుఖపడేది క్షణం. కష్టమే బ్రతుకులో అనుక్షణం.

54. ప్రేమలున్నచోట ప్రేమల్ని నిరోధించడం ఎలాసాధ్యపడదో, ప్రేమలేనిచోట ప్రేమను ఊరేగించడం కూడా సాధ్యపడదు. ప్రేమ అనేది ఆంతర్యంలో ఊరేదే గాని, బయటనుండి కూరేదికాదు; వచ్చిదూరేదీకాదు.

55. పోరాటం దేనికోసం? పోరాటం పోరాటంకొరకా? శాంతికొరకా? బ్రతుకంతా పోరాటమే అయితే, ఇకశాంతి ఎప్పుడు? పోరాటంలో గెలిస్తే శాంతిరాదు. పోరాటం అవసరంలేదని తెలిసినపుడే శాంతి.

56. అశక్తతని అర్థం చేసుకోవడానికి కూడా మనిషి శక్తివంతుడై ఉండాలి.అసమర్థతని అర్థం చేసుకోవడంలోనే సమర్థతకు శ్రీకారం చుట్టడం జరుగుతూ ఉంది అనేసత్యం అందరికీ అర్థమయ్యేది కాకపోయినా, అందరూ శ్రమించి అర్థం చేసుకోవలసింది

57. రోదన లోనే సాధన మొదలవుతుంది. సాధనలోనే వేదన

అదృశ్య మవుతుంది. ఇక బ్రతుకంతా అచ్యుతుని అనుగ్రహంతో హాయిగా సాగిపోతుంది.

58. 'నా బిడ్డలను సుఖ పెట్టాలి' అనేభావం మంచిదే. కాని 'నాబిడ్డలు సుఖపడాలి' అనేభావం ఇంకామంచిది. చాలామంచిది.చాలా మంచి గొప్పది.

59. గురుదేవుని అర్థం చేసుకొనే ప్రయత్నం వ్యర్థం. గురుబోధను అర్థం చేసుకొని జీవించడమే పరమార్థం.

60. అశ్రద్ధకు కాళ్ళు లేవు. అందుకనే, ఎప్పుడూ కూలబడి ఉంటుంది. శ్రద్ధకు రెక్క లున్నాయి. అందుకనే, గగన విహారం చేస్తూ ఉంటుంది.

61. జన్మను కలిగించేది కామం. మృత్యువును ముందుంచేది కాలం. కాలం లోనే కామాన్ని జయించాలి. కామ జయంతో కాలుని దహించాలి.

62. అనిత్యాలను వాటేసుకుంటే అవి కాటేసి తీరుతాయి. కాటేసేందుకే అవి మాటేసుకొని ఉంటాయి.

63. అన్నీ ఉన్నట్లే ఉంటాయి. ఏవీ మనవి కాకుండా పోతాయి. ఏదీ చేతిలో నిలవదని ఒక వైపు అర్థమౌతున్నా, బ్రతుకును మరోవైపు చేజేతులా పాడు చేసుకుంటున్నాం.

64. బాధలే బోధలయ్యేటట్లయితే, పరితాపాలే మనుషులలో పరివర్తనను తెచ్చేటట్లయితే, అందరూ పరివర్తనచెందే ఉండాలి. బాధలు అనుభవించడం వేరు. బాధల నుండి పాఠాలునేర్చుకుని బాగుపడటం వేరు.

65. ఇతరులకు ఏ మాత్రం సేవచేసే అవకాశం ప్రాప్తించినా, అదితనను సేవించడానికి భగవంతుడు నీపై మోపిన అనుగ్రహమని మరచిపోకు. అవకాశాలన్నిటిని ఆరాధనలుగా మలచుకో.

66. నీకు నీవు తోడు కానపుడు ఏదితోడున్నా, ఎవరు తోడున్నా, వాస్తవానికి అదంతా తోడు కాదు. నీడే. ఛాయే.మాయే.
67. ఆత్మీయులు మన సుఖంకోరుతారు. ఆచార్యుడు మన హితం కోరుతాడు. వచ్చి పోయేది సుఖం. వచ్చి ఉండేది హితం. సుఖం అనిత్యం. హితం నిత్యం.
68. తామరాకుపై నీటిబొట్టు, క్షణంలోనే ఆటకట్టు. ఊరేగేది పోయేందుకే. ఉండేది ఊరు ఏగేందుకే.
69. దేహాలన్నీ ఒకే ఆహారం భుజించడం లేదు. కానీ, దేహాలన్నీ శ్మశానంలో ఒకే రంగు గల బూడిదగా కనిపిస్తున్నాయి. సాధకులు ఏమార్గంలో పయనించినా, గమ్యముచేరిన నాడు అది అద్వైతమే. అదే విభూతి సుందరుని వైభవం.
70. మనం ఉన్న దానిని చూస్తున్నామా? లేక మనలో ఉన్న దానినిచూస్తున్నామా? మనలో ఉన్న దానిని చూస్తే అది దృక్పథం. ఉన్న దానిని ఉన్నట్లుగా చూడటం సత్యపథం.
71. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటే, ప్రపంచంలో ఏదీ తెలియకుండా పోతుంది. ప్రతి క్షణము తెలుసు కోవాలి అనే ఆసక్తి, ఆతృత ఉంటే అను క్షణము జీవితంలో జ్ఞానం అందుతూనే ఉంటుంది.
72. లేదు ఇలలో సొంతం. ఇక దేనికొరకు పంతం? చూపు ఉంటే వెలిగేవి కళలు. చూపు పోతే మిగిలేవి కలలు.
73. ధ్యానం చేస్తే ప్రశాంతత వస్తుంది. కాని, ప్రశాంతత లేనిదే ధ్యానం కుదరదు అనే సత్యం ధ్యానం చేస్తే గాని అర్థం కాదు. వైరుధ్యం లేకుండా జీవించడము లోనే బ్రతుకు నైవేద్యంగా మారుతుంది.
74. ఉన్నది మనది కాదు; పట్టుకున్నది మనది. దాచి పెట్టుకున్నది మనది కాదు; పరులకు పెట్టుకున్నది మనది. ప్రక్కన పెట్టుకున్నది మనది కాదు;

ప్రక్కవారికి పెట్టింది మనది.

75. పట్టేవాడు ఉంటేనే పెట్టేవాడు ఉంటాడు. పెట్టే వాడికి కీర్తి కిరీటం పెట్టే వాడు పట్టేవాడే.

76. ద్వైతంలో ఏదైనా జరగవచ్చు; ఆశ్చర్యం లేదు. శివుణ్ణి భయపెడుతూ భస్మాసురుడు వెంట బడ్డాడు. తానే భయపడి అర్జునుడు కూలబడ్డాడు. అంతా ద్వైత నాటకమే.

77. మనస్సు ఎక్కడుంది? అనేది ముఖ్యం కాదు. మనస్సులో ఏముంది? అనేది ప్రధానం. మనస్సులో ప్రపంచంఉంటే, ప్రపంచంలోనే మనస్సు తిరుగుతుంది. మనస్సులో పరమాత్మఉంటే, మనస్సు పరమాత్మ సన్నిధి లోనే ఉంటుంది.

78. ఖాళీ అయితేనే నిండేది. మనస్సు ఖాళీ అయితేనే ధ్యానంపండేది. ఖాళీ చేసుకొనే ప్రక్రియ కూడా ధ్యానం లోని విషయమే. ధ్యాన విషయమేదైనా ఉపకారియే. విషయధ్యానం ఎప్పు డైనా, ఎవరికైనా అపకారియే.

79. కాలం ప్రాణం పోసిన క్షణం కాలాన్ని కబళిస్తోంది క్షణక్షణం. ఉన్నదేదీ కాదు మనంమనమే మనలోఉన్న నిజం.

80. 'చాలు' అనేది చిన్న పదమే. కాని, ఆఒక్క మాటను పలకడానికి మనిషికి యుగాలు సరిపోలేదు.

81. పరుల కన్నీటిని తుడవటం శ్రేయస్కరము. తుడిచే వాడికి రెండుచేతులే. కార్చేవారికి ఎన్నికళ్ళు? ఎవరి కన్నీటినివారు తుడుచుకొనేలా చేయగలిగితే, ఆ తరువాత కన్నీళ్ళు కనిపించవు. ఆవేదనలు అగుపించవు.

82. చావు అనేది అందరికీ ఉంది. అది ఎప్పుడు వస్తుందో ఎవ్వరికీ తెలియదు. వచ్చినా అది క్షణంలో తనపని పూర్తిచేసుకొని పోతుంది. ఆ క్షణం ఎప్పుడని బ్రతికినంతకాలం ఆలోచించడమా? ఎందుకొచ్చినవి ఈ చావుఆలోచనలు?

83. రాయిలో ప్రతిబింబించే శక్తి ఉంది. కాకపోతే పదును పెట్టాలి. ప్రతిఫలించే శక్తి నీటి కుంది. కాకపోతే, నీరు కదలకుండా ఉండాలి. చైతన్యాన్ని వ్యక్తం చేసే శక్తి చిత్రానికి ఉంది. కాకపోతే అది చలించకుండా ఉండాలి. నిశ్చలంగాఉండాలి. నిర్మలంగాఉండాలి.

84. ధనానికి విలువ ఉంది. ధనంలోవిలువ లేదు. ఇదిఅర్థమైతే ధనం దైవంలా శోభిస్తుందేగాని పిశాచంలా పీడించదు.

85. మనం ఓడిపోవాలని భగవంతుడు మనల్ని సృష్టించ లేదు. గెలవాలనే పట్టుదలను పోగొట్టుకొని గెలుపును ఓటమిగా మనమేమార్చుకుంటున్నాం.

86. కొండపైఉన్న మేఘాలతో కొండకుసంబంధం సంబంధం లేదు. అనంతాత్మపైన నీకు అనిత్యాలతోసంబంధం లేదు. కలిసిఉన్నట్లుఉన్నా. కలవనిసంబంధాలను అర్థంచేసుకుంటే కలతలు ఉండవు.

87. బాహ్యంలో చలనాలు, ఘర్షణలుఉంటే ఉండనీ, ఆంతర్యంలో సంచలనాలు, సంఘర్షణలు లేకుండాచూసుకో. ఇదే రాగంలేని స్థితి ద్వేషం తలెత్తని పరిస్థితి.

88. భక్తుడు ఉదాసీనుడు. ఉదాసీనుడు అంటే, దేనిని పట్టించుకోనివాడు అనికాదు. దేనినీ పట్టించుకున్నా, దానికి పట్టుపడనివాడు. ముట్టీముట్టనివాడు. అంటీ అంటనివాడు. ఉన్నట్లే ఉన్నా లేనివాడు. అద్దంలాంటివాడు. అద్దంలాగా అర్థం చెప్పేవాడు.

89. చూడకూడని వాటిని చూడకపోవడం, వినకూడనివాటిని వినకపోవడం బహిరంగ సాధన. చూసినామనస్సు వాటిని పారేసుకోవటం, వినినావాటిని జారేసుకోవటం అంతరంగ సాధన.
90. ఆలోచించకూడని వాటిని ఆలోచిస్తూపోతే, ఒకదశలో మనఆలోచనల్ని మనమే భరించలేని స్థితివస్తుంది. విలువలేని వ్యక్తుల పలవరింతలకు, కలవరింతలకు విలువ కట్టడం ప్రారంభిస్తే, ఆతరువాత మన జీవితమే విలువలేనిదిగా మారిపోతుంది.
91. 'నాస్తి విద్యాసమం చక్షుః' జ్ఞానంతోసమానంగా చూచే కళ్ళులేవు. నేత్రాలు చూడలేని సత్యాలను చక్కగా, సుస్పష్టంగా దర్శిస్తుంది జ్ఞాననేత్రం.
92.బాధలకు, భయాలకు ప్రపంచం కారణం కాదు. ప్రపంచంలో భయకారణాలు, బాధా కారణాలు లేవని తెలియకపోవడమే మనలోభయాలకు, బాధలకు కారణము. అవగాహనా రాహిత్యమే బ్రతుకును ఆవేదనా నిలయంగా మార్చేస్తుంది.
93. దానము కరభూషణము. సత్యము కంఠాభరణము. శాస్త్రము వీనులకు అలంకారము. ప్రశస్తమైన ఈ ఆభరణాలను ధరించేవారికి సువర్ణ ఆభరణా లెందుకు?
94. లేని వాళ్ళను ఎవ్వరూ పిలవరు. ఉన్న వాళ్ళే అయినా పిలిస్తేగానిరారు. పరమాత్మ ఉన్నవాడే. పిలిస్తే పలుకుతూ వచ్చేవాడే. పిలిచేసంస్కారమే బుద్ధికి పట్టాలి. ఇదిఅభ్యర్థన కాదు; ప్రార్థన.
95. ఇది లేదు - అది లేదు అనినిద్రలో అనిపిస్తూ ఉందా? లేదు. అందుకే నిద్ర హాయి. మెలకువలోకూడా లేదు అనేది లేకుండా పోతే, ఉన్న హాయి అంతా మనదే అవుతుంది. మనమే అవుతుంది.
96. నిన్ను నడిపే శక్తిని నీ వద్దే ఉంచుకో. కళ్ళామును ప్రపంచం చేతికిచ్చి బ్రతుకును ఖాళీ పళ్ళెముగా మార్చుకో వద్దు.

97. మనస్సు ప్రపంచంలో పచార్లుచేస్తే దోషం లేదు. మనస్సులో మాత్రం పరమేశ్వరుడే ఊరేగుతూ ఉండాలి.
98. సంతోషంగా ఉన్నప్పుడు అందరూ మంచిగానే అగుపిస్తారు. కాని, మంచిగా ఉన్నంత మాత్రాన సంతోషంగా ఉన్నారని చెప్పలేము. అదే లోకంపోకడ.
99. ఆత్మ ప్రమాణ ఫలం కాదు. అది అప్రమేయము. ఈ సత్యాన్నిదర్శించిన జ్ఞానులు మౌనంగాఉంటారు. అర్థం చేసుకున్న వివేకవంతులు ఆలపించే ప్రయత్నం చేస్తారు. అర్థం గాని మూర్ఖులు వితండవాదాలు వినిపిస్తూ ఉంటారు.
100. మనకు ఏవైనా ఉండవచ్చు.మనకు ఉన్నవి మనల్ని బాధించవు. మనవిగా ఉన్నవే మనల్ని బాధిస్తాయి.బంధిస్తాయి. ప్రపంచంలో ఉన్నవన్నీ పరమేశ్వరునికి సంబంధించినవేగాని మనవికావు. వస్తువు భగవంతునిది. వినియోగము మనది. ఈ అవగాహన బ్రతుకును ఆనందంగా ఉంచుతుంది.
101. నిన్ను గురించి అలసి పోయేటంత ఆలోచనలు ప్రపంచం చేయడం లేదు. ప్రశాంతంగా ఉండు.ఏవేవో ఆలోచించి అశాంతిని కొనితెచ్చుకో వద్దు.
102. విషయాలను అర్థం చేసుకొనేవాడు విద్యావంతుడు. పరులనుఅర్థం చేసుకొనేవాడు బుద్ధిమంతుడు. తనను తాను అర్థం చేసుకున్న వాడేజ్ఞాని.
103. నీ చేతికి గడియారంఉంటే నీకు కాలం తెలుస్తుంది. అలాగని రెండు చేతులకు రెండు గడియారాలు కట్టుకుంటే నీదగ్గర ఉండేది కాలంకాదు; కలత. ద్వంద్వాల మధ్య అందంఉండదు: ఆనందం మిగలదు.

104. ప్రేమ బరువును భరిస్తుందేగాని, బరువని భావించదు. అందుచేతనే ప్రేమస్వరూపాన్ని అర్థంచేసుకున్న వాళ్ళు భారంగా కనిపించరు. వేదనతో అగుపించరు.

105. సైకిలు త్రొక్కడం ఎవ్వరూ సంతలో నేర్చుకోలేదు. నిర్జనప్రదేశాల్లోనే అభ్యసించారు. ఏకాంతమే ఏ సాధనకైనా అనువైన ప్రదేశము.

106. అశాంతికి కారణా లున్నాయి. శాంతికి కారణాలులేవు. శాంతి మన స్వరూపము. మనప్రయత్నాలు, ప్రవృత్తులన్నీ అశాంతికొరకేగాని శాంతికొరకుకాదు. ఇది మనస్సుకు అర్థమైతే, ఆతరువాత అదిఅశాంతి కొరకు ప్రయత్నించదు సరికదా, సదా శాంతి సాగరంలో పవ్వళిస్తుంది.

107. మనకు శత్రువులున్నా, వారికిహాని చేసేస్వభావమే ఉన్నా, అన్నిచోట్ల, అన్నికాలాలలో వారుమనకు హానిచేయలేరు. కాని, మన మనస్సు మనకు శత్రువు అయితే మాత్రం హాని ఎప్పుడైనా జరగవచ్చు. ఎక్కడైనాజరగవచ్చు.

108. ఊహలన్నీ వాస్తవాలు కావు. అందుకే, ఎంత గొప్ప ఊహలైనా పువ్వు ల్లాగా కాలంలో వాడిపోతాయి. స్థిరంగా నిలబడటానికి ఊహలకు కాళ్ళులేవు. కానీ వాస్తవాలకు కాళ్ళే కాదు; రెక్కలు కూడా ఉన్నాయి. కనుక అవి నిలబడటమే కాదు; అవసరమైతే అంబరంలో విహరిస్తాయి కూడా.

109. తన ఆనందానికి తానే కారణమైన వాడుజ్ఞాని. కనుక జ్ఞానిఉన్నాడు అంటేనే ఆనందంగా ఉన్నాడు అనిఅర్థము. అనంతంగా ఉన్నాడు అని భావము.

110. ఎవరి కొరకు ఎవరూ లేరనే సత్యం ఏదోఒక రోజు వంటపట్టవలసిందే. ఆ రోజేదో ఈరోజే అయితే, ఈ క్షణం నుండే స్వేచ్ఛా గాలులు పీల్చుకోవచ్చు.

111. ఏ ఒక్కరూ మరొకరిని సుఖపెట్టలేరు. ఏవస్తువూ సదాసుఖాన్ని పంచలేదు. ఏ పరిస్థితి సర్వత్ర మనల్నిఆనందంగా ఉంచలేదు. ఇదేజీవితం మనకు నేర్పిన పాఠం.
112. సుఖ పడటానికి కోరికలు తీరనవసరం లేదు అనేదిఅర్థమైతే, ఆతరువాత కోరికలు ఉన్నా కష్టంఉండదు. కోరికలు తీరకపోయినా నష్టంవాటిల్లదు.
113. నీవు ఉంటేనే మనస్సుఉంటుంది. మనస్సు లేకపోయినా నీవుఉంటావు. నీవుగాని మనస్సు నిన్నెలా బాధ పెడుతుంది? 'మనస్సునేను' అనిభావించడంచేత ఏర్పడిన దుఃఖము 'నేను మనస్సును కాను' అనేసత్యాన్నిగ్రహించడం వల్లనేపోతుంది.
114. బాధించేది మనస్సయితే, బాధపడేది కూడా మనస్సే. మనస్సులో కూర్చుని బాధకు దూరం కాలేవు. నీవుఅసంగాత్మవు; సాక్షివి. ఈ సత్యం అర్థమైనపుడే నువ్వు సర్వ ఉపద్రవాల నుండి విముక్తిని పొందుతావు.
115. పరులను సుఖపెట్ట గలిగే శక్తిమనకు లేదు. కాని ప్రయత్నిస్తే ఇతరులను కష్టపెట్టకుండా జీవించగలం. ఈ పనిచేయగలిగితే మరోవిధంగా ప్రపంచాన్ని సుఖపెట్టినట్లే.
116. 'విధి' కాదెన్నడూ నీకునిధి.'అదృష్ట'మనేది ఒకచీకటిగది. 'విధి'ని విడిపోనీ. 'అదృష్టాన్ని' వీడిపోనీ. అర్హతలే ఏనాడైనా అందలమెక్కుతాయి. అవగాహనలే ఎప్పుడైనా గొడుగులు పట్టించుకుంటాయి.
117. అంతా శుభమే. ఉన్నదంతాశుభమే. అశుభమనేది కల్పితము; ఆరోపితము. కనుకమనం చేయవలసిందిశుభాన్నికాంక్షించడం కాదు; శుభాన్నివీక్షించడము.
118. ఉన్నది తెలియాలి. ఉన్నది అనేజ్ఞానం కలగాలి. ఆతరువాత, అంతాఉత్సాహమే. ఉత్సవమే. మహోత్సవమే. జ్ఞానమహోత్సవమే.

'నేను'లేకుండా 'నేను' ఊరేగే విజ్ఞానమహోత్సవం.
119. బ్రతుకులో ఏదైనా జరగవచ్చు. బుద్ధిలో ఏదీ జరగకుండా ఉండాలి. అలాఉండాలంటే, భగవంతుడుతోడుగా ఉండాలి. నీడలా ఉండాలి. బుద్ధిలోనిండాలి. భక్తిలో బుద్ధిపండాలి.
120. గాలి అంతటా ఉన్నా, పీల్చినవారికే అది ప్రాణమవుతుంది. ఈశ్వరుడు సర్వత్ర ఉన్నా, పిలిచినభక్తులకే అతడు రక్షకుడవుతాడు.
121. బాగుతెలియాలి అంటేఆలకిస్తే సరిపోతుంది. బాగుపడాలి అంటేమాత్రం ఆచరించితీరాలి. ముక్తి సాధానికి భక్తియేదారి. ముందు దారిలో పడితే, తరువాత ద్వారదర్శనం. జ్ఞానమే ద్వారము. ఆతరువాత దైవదర్శనం.
122. గతాన్ని అంగీకరించలేని దౌర్బల్యం వర్తమానాన్ని పూడ్చేస్తుంది. భవిష్యత్తును కాల్చేస్తుంది. సుఖాలనుఊడ్చేస్తుంది. శాంతిని బ్రతుకులో రాల్చేస్తుంది.
123. ఈశ్వరుడులేనివాడు కాడు; ఉన్నవాడే. ఉన్నవాటిలో సత్యంగా ఉన్నవాడు. ఉన్నవన్నీ పోయిననాడు, పోకుండా వెలుగుతూ ఉండేవాడు. లేనివారికి ఉన్నవాడు. ఉన్నవారిలో ఊరేగేవాడు.
124. తలంచిన ఆలోచనలు తలలో ఒత్తిడిని పెంచుతాయి. మనకు ఏది ఎప్పుడు ఎక్కడ ఎలా ఇవ్వాలో సర్వేశ్వరునికి తెలుసు. ఆ దివ్యాత్ముని పదసరోజాలను ఆశ్రయించుకొని జీవించడమే మనకర్తవ్యం.

125. గుడి గోడలు కూలి పోవచ్చు. గుండెచప్పుళ్ళు ఆగిపోవచ్చు. నిండుబావులు పూడిపోవచ్చు. చెరువుగట్లు తెగిపోవచ్చు. కూలిపోనిది,

ఆగిపోనిది, పూడిపోనిది, తెగిపోనిది భక్తి ఒక్కటే. ఉన్ననాడు తోడుగాఉంటుంది.పోయేనాడు తోడునడుస్తుంది.

126. పగటికి ప్రభాకరుడు భూషణము. నిశికి శశి అందం. అహర్నిశలు జీవికి భక్తియేఅందం. జ్ఞానమేభూషణం.

127. ఆకాశంలో చంద్ర తారకలువెలుగుతూ ఉండొచ్చు.కాని, తెల్లవారాలంటే సూర్యుడు ఉదయించవలసిందే. అరువుతెచ్చుకున్న భావాలతో ఎందరు మిథ్యాజ్ఞానాన్ని బోధిస్తున్నా. సద్గురువు ఉపదేశించినపుడే సత్యజ్ఞానము శోభిస్తుంది.

128. దొంగకు రాత్రిఅనుకూలం. దొరకు పగలు అనుకూలం. భక్తునికి అహర్నిశలు అనుకూలమే. సర్వేశ్వరుని ఆరాధించేవారికి అన్నికాలాలూ అనుకూలాలే.

129. ఇనుపముక్కను పడవలో ఉపయోగించినపుడు అదిమానవులను నదిని దాటించి తీరం చేర్చుతుంది. అదే ఇనుప ముక్కను బాణానికి తొడిగినపుడు నిలువునా ప్రాణాలను తోడేస్తుంది. సత్సంగములో రమించే మనస్సు తరింపచేస్తుంది. దుస్సంగములో చరించేమనస్సు అంతరింప చేస్తుంది.

130. బాధించే ప్రపంచానికి సేవలందిస్తూ పోవాలి. బాధలనునివారించే పరమేశ్వరునితో కలిసిజీవించడం అలవరచుకోవాలి. మేను ప్రపంచానికి; మనసు పరమేశ్వరునికి. ఇదే తరించేమార్గము.

131. ప్రపంచంలో ఏదీ ఆకర్షించలేని స్థితికి నీవుచేరగలిగితే, ప్రపంచాన్ని అయస్కాంతంలా నువ్వేఆకర్షిస్తావు. మోహపంకము అంటని హృదయకమలాన్ని పరమేశ్వరుడు దివ్యంగా ప్రకాశింప చేయడమే దీనికి కారణము.

132. బాహ్యంలోని పోరాటాలకు ఆంతర్యంలోని ఆరాటాలే కారణాలు.

నిజానికి అవే జీవన పోరాటాలు. సమర కవాటాలు.
133. ఇతరుల మాటలను ఓపికగా వినాలి. సంపన్నులను చూచి నపుడు కళ్ళు చల్లగా ఉండాలి. పరుల ప్రగతినిగాంచి హృదయం పులకరించాలి. ఇలా జీవించ గల వారెవరైనా తప్పకసాధకు లవుతారు.
134. మనఅశక్తత దుఃఖాన్నితెచ్చి పెడుతూఉంటే,పరమేశ్వరుని అనుగ్రహం సుఖాన్నిప్రసాదిస్తూ ఉంటుంది. అనర్థాలను విడిచిపెట్టి పరమార్థాన్ని ఆశ్రయిస్తే బ్రతుకుదివ్యంగా శోభిస్తుంది.
135. బరువులను మోయడానికి గాడిదలు చాలు. విలువలు గ్రహించాలంటే బుద్ధిలో వెలుగు ఉండాలి. బుద్ధిదీపం దివ్యంగా ప్రకాశించేవారే ప్రపంచంలో విలువైన వారు.
136. ఉల్లికి అలవాటుపడిన లోకానికి మల్లెలసౌరభం పట్టదు; గిట్టదు. మురికిగుంటలో ఈదులాడేమనసుకి మానససరోవర జలాలు రుచించవు. మోహంలో కూరుకుపోయిన మనుషులకు మోక్షాసక్తి కలగదు.
137. ఉండరానిది ఉన్నంత కాలం ఉన్నతి సాధ్యంకాదు. సృష్టిలో దృష్టిని సారించేవానికన్నా, దృష్టిలోని సృష్టిని సవరించుకున్నవాడే పుష్టిని, సంతుష్టిని పొందుతాడు. కష్టాలను అధిగమిస్తాడు.
138. ఏ క్షణాన గాలం నీటిలో ప్రవేశిస్తుందో తెలియదు. ప్రవేశించిన క్షణాన చేపకు ఆయువు తీరినట్లే. ఏ క్షణాన కాలుడు మనపై కాలు మోపుతాడో అర్థం కాదు. మృత్యుంజయుని ఆశ్రయిస్తే, మృత్యువును దాటవచ్చు.ఆలోచించు.
139. ఆసక్తి ఉన్న చోట అందం ఉంటుంది. అందం ఉన్నచోటికి మనస్సు ఆకర్షింప బడుతుంది. వాస్తవానికి ఆసక్తిఅనేది ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. మనస్సులో అందంఉంటే మహిమపై ఆసక్తి ఉంటుంది. మనస్సులో అందంలోపిస్తే, మహియే మనస్సుకు మహిమగా గోచరిస్తుంది.

140. కళ్ళు మూసిన వారందరూ నిద్రపోయే వారు కారు. అలాగే కళ్ళు తెరిచిఉన్న వారందరూ చూస్తున్నారని చెప్పలేము. మనసు మూతపడితేనే ధ్యానం. బ్రహ్మాత్మదర్శనమే జ్ఞానం.
141. ప్రపంచాన్ని గూర్చి అతిగాఆలోచించి నంతకాలము మనసుపై మనకు పట్టుచిక్కదు. రాగద్వేషాల మధ్య ఊగిసలాడినంతవరకు మనమనసుపై మనకు ఆధిపత్యం సిద్ధించదు. కాని, ఒక్కసత్యాన్ని సాధకులు గ్రహించాలి. తనను దూరంచేసిన వారికి దగ్గరకావడానికి మనస్సు ఎన్నడూఇష్ట పడదు.
142. దూరం ఎవరికైనాభారమే. దూరం ఉన్నప్పు డేసంబంధం. అందుకనే సంబంధాలన్నీ భారాలే అవుతాయి. బాధలనే సృష్టిస్తాయి.
143. ఉప్మాతిని ఉదరం ఊరకుంటుంది. ఉప్పు సరిపో లేదని నాలుక ఊరంతా ఏకంచేస్తుంది. ఆహారంవిషయంలో అవసరమున్న ఉదరంకన్నా, నానారుచులకు అలవాటుపడిన నాలుకేప్రమాదకరం.
144. దేహాలు పుడుతాయి. పుట్టినవిపెరుగుతాయి. పెరిగినవి తరుగుతాయి. తరిగినవిఒరుగుతాయి. ఒరిగినవికరుగు తాయి. చంచలవస్తువులు, చపలహృదయాలు తప్ప ఏమున్నాయి ఈ ప్రపంచంలో?
145. కొంత కాలం క్రితం లేని మనం మరి కొంతకాలం కొనసాగితే ఉండబోము. ఈమధ్యలో ఏమిసాధించినట్లు? దూరమైన వాటినిమరువలేక చేరువైనవాటిని నిలుపుకోలేక సతమతమవుతున్నాము. ఆరిపోయేదీపం ఎంతకాలం ఉంటుందంటే ఏమిచెప్పగలం? దీపమున్నప్పుడే ఇల్లుచక్కబెట్టుకోవాలి అనేసలహా ఇవ్వగలం అంతే.
146. వృత్తిశూన్యతలో ఏముంది? శూన్యంతప్ప! వృత్తిమూలంలో స్వరూపాన్ని దర్శిస్తేనే పూర్ణఫలం.
147. పుస్తకాలలో ఉన్నజ్ఞానము, పరులవద్ద దాచిన ధనము నిరర్థకాలే నిరుపయోగాలే. అవసరం ఏర్పడినపుడు అవిఉపకరించవు.

మస్తకములోని జ్ఞానము, హస్తగతమైన ధనము - ఇవే అవసరాలలో రక్షిస్తాయి.

148. అనంతాత్మను అమితంగా ప్రేమించడం వల్లనే ఈ ప్రపంచంలో ఎన్నిటినో ప్రేమించడం జరుగుతూ ఉంది. అనంతాత్మ ఒక్కటి ప్రియంకావడం చేత, విశ్వంలో ఎన్నెన్నో ప్రేమింప బడుతున్నాయి. ఎందరెందరో ప్రియంగా తెలుస్తున్నారు.

149. ప్రవాహం నదీ జలాలను సముద్రానికి చేర్చినట్లు, కాలప్రవాహం బ్రతుకును వల్లకాటికి చేర్చుతుంది. కాల ప్రవాహంలో ఆశల దీపాలు ఆరిపోతాయి. బాంధవ్య నౌకలు ముక్కలై పోతాయి. కాలాన్ని వాడుకోవాలేగాని కాలంతో ఆడుకోకూడదు. వాడుకలోనే ఉంది వేడుక.

150. ఏవిత్తనం నాటుతామో ఆ చెట్టే వస్తుంది. మనిషి ఎలా ఆలోచిస్తాడో అలాగే తయారవుతాడు. ధ్వనిని బట్టే ప్రతిధ్వని. ఇతరులకు మనం ఏది ఇస్తామో అదే మనకు తిరిగి ప్రాప్తిస్తుంది.

151. ప్రతి పుట్టుకకు చావు ఉంది. ప్రతి అభివృద్ధికి అవరోధం ఉంది. ప్రతి ప్రయాణానికి విరామం ఉంటుంది. ప్రతి సంయోగానికి వియోగం ఉంటుంది. వగచి సాధించే దుండదు. అవగాహనతో ముందుకు సాగిపోవడమే.

152. ఒకరి ఆలోచనలకు మరొకరి వద్ద సాక్ష్యాధారాలు లేవు. నీ కష్టాలకు ఇతరులు కారణం కాలేరు. నిన్ను కలత పెట్టే అవకాశాన్ని నీవు ఇతరులకు ఇచ్చినప్పుడే ఇతరులు నీ అశాంతికి కారణ మవుతారు.

153. జీవితమొక భయంకరమైన పోరాటము. పోరాడే పని మనది. గెలిపించే శక్తి పరమేశ్వరునిది. గెలుపు మన మీదే ఆధారపడి ఉంది అనే అహంకారమే అనేక జన్మలలో మన ఓటమికి కారణ మైంది. గెలిపించే వాని వైభవాన్ని స్మరిస్తూ పోరాడటం అలవరచుకుంటే విజయం మనల్ని

తప్పక వరిస్తుంది.
154. కొన్ని మాత్రమే తీరి, మరెన్నో కోరికలు తీరనివిగా మిగిలి ఉన్న వ్యక్తి ఏమి సాధించినట్లు? తీరని కోరికలులేని వాడే ఆప్తకాముడుగా శోభిస్తాడు.
155. సజ్జనులు చరించిన బాటే సన్మార్గము. మహాపురుషులు నడచిన త్రోవే మహాప్రస్థానము. ముందు నడచిన వారి పాద ముద్రలను దర్శిస్తూ ముందడుగు వేయాలి. మన వెనుక నడిచే వారికి ఆదర్శంగా బాటను నిలుపుతూ ముందుకు సాగి పోవాలి. ఇదే కళ్యాణ పథం.
156. నీ కష్టాలను కరిగిస్తాను, నీ దుఃఖాన్ని దూరం చేస్తాను అని పలికేది వేదాంతం కాదు. నీవు కష్టాల నుండి, బాధల నుండి విడిపడే ఉన్నావు అనే సత్యాన్ని బోధించేదే వేదాంతం.
157. 'నాది కాకపోయినా, నాకు లేక పోయినా, పువ్వుల సుగంధాన్ని మోసుకొని వచ్చి ముక్కులకు మొక్కు తీర్చుతాను' అనే గాలి లాగా ఎందరు సేవా స్ఫూర్తితో చరించ గలరు? ఎవరు అలా చరించినా, సంచరించినా వారందరూ మహాత్ములే మహికి ఆత్మలే.
158. పొద్దుకు హద్దు లున్నాయి. బుద్ధికి హద్దు లున్నాయి. బ్రతుకుకు హద్దు లున్నాయి. భక్తికి హద్దులు లేవు. అందుకే భక్తి అనంత మైనది. అమృత స్వరూప మైంది.
159. పూలు, కాయలు లేని చెట్లను తుమ్మెదలు, పక్షులు వదలి వెళ్ళునట్లు, ప్రాణాలు పోగొట్టుకొని నిర్జీవమైన దేహాలను బంధువులు, మిత్రులు త్యజిస్తారు. ఇంటిలోని ధనాన్ని పరులు అనుభవిస్తారు. ఒంటిలోని ధాతువులను జంతువులు ఆరగిస్తాయి.
160. 'నేను' ఉన్న చోట చావు లేదు. 'నేను' అనే దానికి చావు రాదు. ఇక నేను, చావు కలిసే దెలా? నాతో చావు కలబడే దెలా? చీకటి వెలుగుల వింత పోరాటం చూసేందుకు కవాటం ఎక్కడ?

161. అశాంతిని అనుభవించటానికి ఏవేవో చేయాలి. శాంతిగా ఉండటానికి చేసే దేముంది? నీవు మరొకటి కావాలనుకోవడం నీకు వేరొకటి రావాలనుకోవడమే అశాంతి. నీవు నీవుగా ఉండ గలిగితే నీవే శాంతి.
162. జ్ఞానమైనా, అజ్ఞానమైనా బుద్ధిలోనే ఉంటుంది. వేదాంతం బుద్ధికి పడితే, బుద్ధిలో జ్ఞానం తప్ప మరొకటి ఉండే అవకాశం లేదు. వేదాంతం బుద్ధికి అందని కారణం గానే అజ్ఞానం బుద్ధిని ఏలుతూ ఉంది.
163. న్యాయానికి న్యాయం చేయగలిగితే బ్రతుకు అన్యాయం కాదు. సత్య దర్శనానికి సహకరించే వాదమే న్యాయము.
164. బ్రతుకు ప్రయాణాన్ని నడిపేది బుద్ధి లోని నిర్ణయాలే. నిర్ణయాల ఇంధనంతోనే బ్రతుకు బండి సాగుతుంది. నిర్ణయాలలో స్పష్టత ఉండాలి. వివేకం లోపించిన బుద్ధి సరియైన నిర్ణయాలను చేయలేదు. అందుకని, సదా బుద్ధి భగవంతుని ప్రార్థిస్తూ ఉంటే, ఈశ్వరానుగ్రహంతో నిర్ణయాలు దివ్యంగా సాగుతాయి.
165. పరులలో దోషాలు ఉండవచ్చు. అలాగని మనలో దోషాలు లేవా? మనలో దోషా లున్నాయని మనల్ని మనం అసహ్యించుకుంటున్నామా? ఇతరులు కూడా మన లాంటి వారే, వాళ్ళూ మనుషులే.
166. శాంతి అనేది నీకు తెలియనిది కాదు. నీ అనుభవములో లేనిది కాదు. శాంతి నీ అనుభూతి. స్వరూపానుభూతి. అలాంటిది వస్తూ పోతూ ఉన్నట్లు గోచరించడానికి కారణం, అశాంతికి కారణమైన సంకల్పాలు నీలో వస్తూ పోతూ ఉండటమే.
167. ప్రపంచం ఏమిటో ప్రపంచం చెప్పడం లేదు. నీవు చెబుతున్నావు. కనుక, ప్రపంచం యొక్క అర్థం నీలో ఉందే గాని ప్రపంచంలో లేదు. ప్రపంచం నీ కన్నా అన్యంగా లేదు కనుకనే ప్రపంచం యొక్క అర్థం నీలో శోభిస్తూ ఉంది. వాస్తవం చెప్పాలంటే, అదే పరమార్థం.

168. ఆత్మ ఏమిటో తెలియక పోవడం వల్ల ఆత్మకు సంబంధించిన అజ్ఞానము అందరికీ ఉంది. ఆత్మ జ్ఞానమును పొందితే తప్ప మరో విధంగా అజ్ఞానము నశించే అవకాశం లేదు.
169. తృప్తి చుట్టం లాగా వచ్చి పోతూ ఉంటుంది. అసంతృప్తి అర్ధాంగి లాగా కలిసి కాపురం చేస్తుంది. 'నేను ఇలా ఉండాలి' అని భావించినంత కాలం తృప్తి అనేది కుందేటి కొమ్మే. 'నేను ఇలా ఉన్నాను' అనే సత్యాన్ని గ్రహించినపుడే నిత్యతృప్తి.
170. విలువలు లేని బ్రతుకు వెల వెల పోతుంది. విలువల యొక్క విలువను తెలిసిన వాడే ప్రపంచంలో విలువైన వాడు. విలువైనది అరుదుగానే ఉంటుంది. అందుకనే, విలువైన వారు సమాజంలో విరివిగా లభించరు.
171. బోధ పడిన వాడు బాధ పడడు. బాధ పడే వాడు బోధలో పడ లేడు. భూత భవిష్యత్తులు బాధా వలయాలు. వర్తమానమే ప్రబోధ స్వరూపం.
172. సత్యాన్ని అంగీకరించే విశాల హృదయులకు ఓటమి అర్థం కాదు. అపజయ మనేది ఉండదు. నియతి అర్థం కానపుడే జీవితంలో వెలితి.
173. జీవితంలో పొంద వలసింది ఏమిటో అర్థం కానపుడు, పొందినవి ఎన్నున్నా, ఎన్నైనా నిరర్థకమే అవుతాయి. పొంద వలసింది అర్థమైనపుడు మార్గాలన్నీ ఒకే గమ్యం వైపు నడుస్తాయి.
174. సంఘర్షణ లేని బ్రతుకు నిజానికి బ్రతుకేనా? బ్రతుకే సమస్యల సుడి గుండం. బ్రతుకులో సమస్యలు ఉండటం సమస్య కాదు. సమస్యలు అర్థం కాకుండా ఉండటమే సమస్య. సమస్య అర్థం కావడమే సమస్యకు నిజమైన పరిష్కారం.

175. నీకు సంబంధించి నీవు ఏర్పరచు కున్న కల్పిత భావాలను దూరం చేసుకున్నప్పుడే, నీ వంటే ఏమిటో నీకు తెలిసి వస్తుంది. ఈ మార్గంలో నీకు సహకరించ గలిగేది వేదాంత మొక్కటే.
176. సత్య మేమిటో తెలియని బ్రతుకు అసత్యంలో అలమటిస్తూ ఉందని అర్థం. అసత్యంలో అనర్థ ముంటుందే గాని పరమార్ధ ముంటుందా? సత్య జ్ఞానము లేనపుడు ఏవి ఉన్నా అవి ఉనికిని కోల్పోతాయి.
177. మతి లోని భావాలతో సత్యాన్ని పట్టుకోలేము. శ్రుతి అందించే ప్రమాణంతోనే బ్రతుకు పండుతుంది; నిండుతుంది.
178. ఈ ప్రపంచ రంగస్థలిపై నీవూ ఒక పాత్రను పోషిస్తున్నావు. నీ పాత్రను రచించింది ఎవరో కాదు; రాముడే. పాత్ర ఎవరిదో కాదు; నీదే. పాత్ర విశేషాలన్నీ నీవే. పాత్ర నీవే. కాని, నీవు పాత్ర కాదు. ఇది అర్థమైతే, నీవు ఆత్మారాముడివి; ఆనంద శ్యాముడివి.
179. నీవు బలహీనుడివి కావు. నీలో బలహీనత లేదు. 'నేను బలహీనుణ్ణి' అనే ఆలోచనలోనే బలహీనత ఉంది. బలహీనమైన ఈ ఆలోచనను బలంగా బాహ్యానికి నెట్టేయ్. నువ్వు బలవంతుడివి అని ఆ క్షణం లోనే నీకు అర్థమై పోతుంది.
180. ప్రపంచం పరమేశ్వరుని కన్నా వేరు కానపుడు, ప్రపంచంలో జరిగేవి మాత్రం ఎలా వేరుగా ఉంటాయి? జరగదగినవే జరుగుతున్నాయి. ఇదే నియతి. నియంత సంగతి. ఈ సత్యం అర్థమైన వారికి దేనితోనూ వైరుధ్యము లేదు. ఏదీ ప్రతికూలం కాదు. అన్నీ అనుకూలాలే.
181. ఏదో జరగాలని ఆశించే వాడు నిత్య భక్తుడు కాలేడు. జరిగే వాటన్నిటిలో పరమేశ్వరుని అదృశ్య హస్తమును దర్శించే వాడే నిత్య భక్తుడు.

182. నీ ప్రమేయంతో జరిగేవి చర్యలు. నీ స్పృహ లేకుండా వ్యక్తమయ్యేవి ప్రతిచర్యలు. చర్యలన్నీ ప్రతిబంధ కాలు కావు. కాని, ప్రతిచర్యలన్నీ ప్రగతికి ప్రతిబంధకాలే.

183. నీవు చేయ వలసింది ఈ ప్రపంచంలో ఉంది. నీవు చేయదగింది ఉన్నా, నీవు చేయగలిగిందే చేయగలవు. ఈ విషయంలో జయమూ లేదు; అపజయమూ ఉండదు. అర్థంకానివే నిరాశలను సృష్టిస్తాయి.

184. ఇతరులను మార్చాలని, పరిస్థితుల్ని మార్పు చేయాలని నీవు నిరంతరం చేసే ప్రయత్నాల వెనుక, నీవు ఒక ప్రత్యేకమైన స్థితి లోకి మారాలనేదే ప్రధానమైన విషయము. ఈ సత్యం బుద్ధికి పడితే, ఆ తరువాత ఏదీ మారనవసరం లేదు. ఎవరినీ మార్చవలసిన అగత్యం ఉండదు.

185. మనిషే సృష్టింప బడినపుడు, ప్రత్యేకంగా మనిషి సృష్టించే దేముంటుంది? సృష్టికర్తే సృష్టిలో సృష్టిగా ఉన్నాడు. సృష్టిలో సృష్టికర్తను వీక్షించే వాడు తానేదో సృష్టించానని, సృష్టించ గలనని భావించడు.

186. కొన్ని బరువులు తేలికగా ఉంటాయి. వాటిని ఎవరైనా మోయ గలరు. కొన్ని భావాలు చాలా బరువుగా ఉంటాయి. వాటిని మోయడం ఎవరికైనా కష్టమే. బరువైన భావాలను బుద్ధికెత్తుకోక పోతే, బ్రతుకు హాయిగా, తేలికగా గాలిలో తేలిపోతూ ఉంటుంది.

187. చెయ్యా లనుకున్నవి మనం చేయలేక పోవచ్చు. కాని, ప్రయత్నిస్తే చెయ్య గలిగినవి చెయ్యగలం. అలా చెయ్యా లనేదే ఈశ్వర సంకల్పం కనుక ఆ కార్యాలను ఆచరించడానికి అనువైన ప్రదేశము లోనే మనం ఉన్నాం.

188. బ్రతకాలి అనుకున్నప్పుడు బాధలు తప్పవు. బాధలుఎక్కడుంటాయి? బ్రతుకులోనే ఉంటాయి. బాధలు లేకుండా బ్రతుకు ఎలా అర్థ మవుతుంది? బాధ లేకుండా ఉండాలంటే, చెయ్యి తెగిపడినా అర్థం కాకుండా ఉండాలి. అలా ఉండటమే బ్రతుకైతే, చేతులు లేని బ్రతుకు చేసేందుకు ఏముంటుంది?

189. భగవంతుడు భక్త సులభుడు. అంటే, భక్తుల చేత సులభంగా పొందబడేవాడు. ప్రయత్నం లేకుండా దేనినీ పొంద లేము. ఏ ప్రయత్నమైనా శ్రమ ఉంటుంది. మరి భగవంతుడు ఎలా సులభుడు? పరమేశ్వరుడు సాధ్యరూపుడు కాడు కనుక. నీ ఆత్మ స్వరూపంగా సిద్ధమయ్యే ఉన్నాడు కనుక, అర్థమైతే సులభుడు.

190. జీవన పోరాటమే బ్రతుకుకు పరమార్థ మైతే, నేనూ జంతు జాలములో ఒకడినై పోతానేమో? మరి, నాలో మానవత్వపు విలువల మాటేమిటి? అవి నా నుండి దూరమైనట్లేనా? ఇక, మానవ జన్మ ఎలా దుర్లభము? ఎలా ప్రశస్తము?

191. నీ బాధకు ఏ వ్యక్తి కారణమైనా, ఆ వ్యక్తి బాహ్యంలో లేడు; నీ ఆంతర్యం లోనే ఉంటాడు. ఆంతర్యంలో లేకుండా అంతరంగాన్ని కలత పెట్టడం సాధ్యం కాదు. బయట ఉండవలసిన వాటిని బయటే ఉంచ గలిగితే, ఆంతర్యంలో అలజడులు ఉండవు. పైగా ప్రశాంతత రాజ్య మేలుతుంది.
192. భగవంతుని చూడాలని ఉందా? అయితే, ముందుగా నీ మనస్సులో ఏముందో చూడు. భగవంతుని దర్శించడానికి మనస్సులో ఏమైనా అవరోధా లున్నాయేమో పరిశీలించి మరీ చూడు. ఒకవేళ ఉంటే, వాటిని దూరంగా విసిరేయ్. ఆ తరువాత జరిగేదంతా భగవద్దర్శనమే.
193. ఇతరులకు సహాయం చేయడానికి ధనమే ఉండనవసరం లేదు. పవిత్రమైన హృదయం ఉంటే చాలు. జీవితంలో ధన మొక్కటే అవసరం కాదు. ఒక మంచి మాట ఓదార్చినంతగా ధనం ఓదార్చ గలదా?
194. మనతో కలిసి జీవించే వారిని విస్మరించి జీవితాన్ని కొనసాగించడం సాధ్యం కాదు. అలాగని వారిని చక్కదిద్దే ప్రయత్నంలో మీరు ఒత్తిళ్ళకు లోను కాకండి. ఒకరి తలరాతను మార్చడం అనుకున్నంత సులభం కాదు; అందరికి సాధ్యమూ కాదు.
195. కాలం ఎంతో విలువైనది. విలువైన వన్నీ కాలంలోనే సాధింప బడతాయి. విలువైన కాలాన్ని వినియోగించుకున్న వారు విలువైన దానిని సులువుగా సాధించు కుంటారు.
196. నాకు భగవంతుడు కావాలి అని ఆశించే వారికి భగవంతుడంటే ఏమిటో తెలుసా? భగవంతుడంటే ఏమిటో తెలియనపుడు భగవంతుణ్ణి ఎలా పొందుతారు? కనుక, ముందుగా భగవంతుడంటే ఏమిటో తెలుసు కోవాలి. భగవంతు డేమిటో తెలిస్తే, ఆ తరువాత భగవంతుణ్ణి పొందాలి అనే ఆశే చిగురించదు. ఎందుకని? భగవంతుణ్ణి 'నేను పొందే ఉన్నాను' అనేది వారికి అర్థ మవుతుంది కనుక.

197. జీవితంలో అనుకూలాలకన్నా ప్రతికూలాలే ఎక్కువగా ఉంటాయి. ప్రారబ్ధ ఫలాలుగా ఊడిపడే ప్రతికూల పరిస్థితులకు ఎదురు నిలవడం సాధ్యమయ్యే పని కాదు. ప్రారబ్ధం పంచే ప్రతికూలాలను అనుకూలాలుగా మలచుకోవడం భగవత్కృపతోనే సాధ్యం. భగవంతుని సేవించడం వల్లనే భగవత్కృపను పొందగలం.

198. వట్టి చేతులతో, ఓటి చేతులతో ఈ ప్రపంచంలో ప్రవేశించి, ఆ తరువాత ప్రతి దానిని నాది నాది అని దోచుకోవడం, దాచుకోవడమే మనిషి చేసిన పెద్ద తప్పు. నాది - నాది అంటూ చేసిన తప్పును నీది - నీది అని భగవంతునికి సమర్పించి సరి చేసుకోవాలి. ఇదే అర్పణ భావము. సమర్పణ భావము.

199. ధర్మ రూపంలో ఉన్నది దైవమే అనే సత్యం అర్థ మైనపుడే ధర్మాచరణం సాధ్య మవుతుంది. ధర్మాచరణం సాగుతూ ఉంటే దైవారాధన కొన సాగుతూ ఉంటుంది.

200. మన లోని వైభవానికి మనం పరమేశ్వరునికి ఋణపడి ఉన్నాము అనే సత్యం అర్థమైతే, ఆ తరువాత ప్రపంచం నుండి గుర్తింపులు, గౌరవాలు కావాలని రావాలని మనస్సు ఆశించదు. కృతజ్ఞతతో హృదయంలో ప్రశాంతంగా ఒదిగి ఉంటుంది.

201. దుర్గుణాలను దూరం చేసుకోవాలి అనే ప్రయత్నంకన్నా సద్గుణాలను ప్రోగు చేసుకొనే ప్రయత్నంలోనే మనిషి మనీషిగా మారుతాడు. సుగుణవంతుడై, తనలో సుగుణాలు ఉన్నట్లు కూడా తెలియని నాడు మనీషి మహర్షి అవుతాడు.

202. మనం ఆశించింది జరగక పోయినా, అలా జరగక పోవడానికి కారణమైన నియతిని అర్థం చేసుకుని, దానికి అనుగుణంగా జీవించ

గలిగితే, ఆ తరువాత తృప్తి అనేది మనల్ని విడిచి పోయేందుకు సాహసించదు.
203. బాధల్ని భగవంతుడు సృష్టించలేదు. బాధలనేవి భగవంతుడు విధించే శిక్షా కాదు. మరొకరు పంచడానికి బాధ ప్రసాదమూ కాదు. మనమేమిటో, మనం జీవించే ప్రపంచం ఎలాంటిదో ఏ మాత్రం అర్థం కాకపోవడం చేతనే బాధలు తలెత్తుతాయి. అర్థమైతే తల దించుతాయి. ఇదీ సత్యం.
204. ఏది తెలిసినా, ఎంత తెలిసినా, తెలియనిదంటూ ఉండే టప్పుడు ఆ జ్ఞానం పూర్ణం కాదు. పూర్ణం అర్థమైనపుడే బ్రతుకులో అనంతానందం నిండుతుంది.
205. ఈ ప్రపంచంలో మనిషిని మించిన అద్భుతం లేదు. ఆనందం ఉండదు. దృశ్యమాన జగత్తులో ఎన్నిటిని పరిశీలించినా, మనిషిలో ఏముందో అర్థ మైనపుడే పరిశోధనలకు పూర్ణత్వము. మనిషి కన్నా అన్యంగా ఏదున్నా, ఏమున్నా అది సత్యం కాదు. సత్యం మనిషి లోనే ఉంది. మనిషే సత్యము.
206. విలువైనవి, వెల కట్టలేనివి, వెలుగులను విరజిమ్మేవి ప్రార్థనలు. ప్రార్థనలు పాపాలను హరిస్తాయి; ప్రారబ్ధాలను కరిగిస్తాయి. పురంలో పురారిని దర్శింప చేస్తాయి. సర్వంలో సమారాధన చేయిస్తాయి.
207. పూజ కూడా కర్మే. భక్తి తోడైనపుడే అది అర్చన అవుతుంది. ఆరాధన అవుతుంది. ఉపాసన అవుతుంది. అంత వరకు జరిగే వన్నీ పనులే కాని పూజలు కావు. ధ్యాసలే కాని ధ్యానాలు కావు. పరమాత్మ జ్ఞానము కలిగి నపుడే హృదయంలో ప్రేమ నిండు కుంటుంది. ఆ ప్రేమే భక్తి.
208. చేసిన వన్నీ చెదిరిపోనీ. కాని వన్నీ కాలిపోనీ. మాలిన్యాలన్నీ మండిపోనీ. మాయలన్నీ మాసిపోనీ. భగవంతుడు సముడు. నిన్ను

సమంగా చూసుకుంటాడు. అనర్థాలన్నీ కూలి పోయిననాడు తానొక్కడే పరమార్థంగా నీలో నిలిచి వెలుగుతూ ఉంటాడు.
209. నామి ఉన్న చోట లేమి ఉండదు. నామం నాలుకపై ఉంటే నామి హృదయంలో ఉన్నట్లే. లేమిలేనట్లే. కలిమి ఉన్నట్లే. కైవల్యానికి దారి సుగమ మైనట్లే. లేమి తెలియని కలిమిని కనికరించి, వైకల్యం లేని కైవల్యాన్ని అనుగ్రహించే దివ్యామృతమే నామ సంకీర్తనము.
210. పిండి తింటే చప్పగా ఉంటుంది. పిండిలో పంచదార కలిపితే పిండి మాధుర్యంతో నిండి పోతుంది. కర్మలన్నీ పిండి లాంటివి. వాటిలో భక్తి అనే పంచదార కలిస్తే బ్రతుకే తియ్యగా మారి పోతుంది.
211. పక్షపాత మెరుగని పరమాత్మ భక్తిని చూచి కరుణిస్తాడే గాని, జాతి, రూప, కుల భేదాలను చూసి కాదు. శివునికి ఎద్దు వాహనము. విష్ణువుకు గ్రద్ద వాహనము. బ్రహ్మకు హంస వాహనము. పశుపక్ష్యాదు లైతే నేమి? భక్తి ఉన్నందుకు పరమాత్మను మోస్తూ శోభించాయి.
212. మనసులో భక్తి లేనపుడు పూజా గదిలో ఉండేది మానవుడే గాని భక్తుడు కాడు. చెరువేలేనపుడు నీళ్ళెక్కడుంటాయి? భక్తుడేలేనపుడు భక్తి ఎక్కడుంటుంది? భక్తి, భక్తుడులేని పూజలో భగవంతుని పాత్రేమిటి?
213. ఈ ప్రపంచంలో ఎవరు ఎవరిని ప్రేమించినా ఆ ప్రేమలో స్వార్థమే ఉంటుంది. ప్రేమలు, చింతకాయలు - నిజానికి ఇవన్నీ కాయ సంబంధంతో ఏర్పడిన చింతలు. మోయలేని బరువులు. భరించలేని బాధలు. దుర్భరమైన దుఃఖాలు,
214. గురువును వ్యక్తిగా చూచే వారు ఎన్నడూ శిష్యులు కాలేరు. గురువు వ్యక్తి కాదు. అద్భుత శక్తి. జీవన శక్తి. జీవికి శక్తి. గురువు మామూలు వ్యక్తి అయితే, మన ఊహలు అతనిని పట్టుకో గలుగుతాయి. గురువు శక్తి

అయినపుడు? ఆయన మహిమను అర్థం చేసుకోలేక మన మనస్సులే మూగ బోతాయి.

****